# త్రిపురలో బిజెపి సాగించిన ప్రతీఘాతుక, ఫాశిస్టు తరహా దాడులను ఖండించండి

**ఇటీవల** త్రిపురలో జరిగిన శాసనసభ ఎన్నికలలో, స్వల్ప ఓట్ల తేడాతో సాధించిన విజయంతో పిచ్చెక్కిన బిజెపి, తన 'ప్రజాస్వామిక' ముసుగును తొలగించుకొని, వాస్తవిక ముఖంతో బయటకొచ్చి త్రిపురలో ప్రతీఘాతుక, ఫాశిస్టు తరహా గూండా దాడులను సాగించింది.

2018 మార్చి 5న, దక్షిణ త్రిపురలోని బెలోనియా పట్టణం-కాలేజి స్క్వేర్‌లోవున్న లెనిన్ విగ్రహాన్ని బిజెపి కార్యకర్తలు తమ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. 'భారత్ మాతాకీ జై' నినాదాల మధ్యన లెనిన్ విగ్రహాన్ని వారు నేలమట్టం చేశారు. లెనిన్ విగ్రహాన్ని కూలగొట్టటానికి దాడికి పాల్పడినవారు బుల్‌డోజర్‌ను ఉపయోగించటంతో, తమ ఫాశిస్టు చర్యకోసం వారు ఏవిధంగా పథకరచన చేసి, తయారై వచ్చారో అర్థమౌతుంది. 'లెనిన్ విగ్రహాన్ని కూల్చిన వెంటనే మొదట లెనిన్ తలను, మిగతా దేహాన్నుండి వేరుచేసి, ఆపై బిజెపి కార్యకర్తలు లెనిన్ తలతో ఫుట్‌బాల్ ఆడుకున్నార'ని ప్రత్యక్షసాక్షులు తనతో చెప్పినట్లుగా సిపిఐ(ఎం) బెలోనియా సబ్‌డివిజన్ కార్యదర్శి తపన్‌దత్తా తెలిపారు. సిపిఐ(ఎం) త్రిపుర రాష్ట్రకార్యదర్శి హరిపాదదాస్ చెప్పిన వివరాల ప్రకారం, సిపిఎం పార్టీ మరియు వారి అనుబంధ ట్రేడ్‌యూనియన్ల కార్యాలయాలపైనా జరిగిన దాడులలో 240మంది పైగా గాయాలపాలయ్యారు. దాడులకు పాల్పడిన వారు నాయకుల ఇళ్ళను సైతం వదలలేదు. ఎన్నికల ఫలితాలు వెలువడటంతోనే, బిజెపి మరియు వారి మిత్రపార్టీ ఐపిఎఫ్‌టిలు వామపక్ష కార్యకర్తలను భయభ్రాంతుల్ని చేయటానికి, వారి పార్టీ కార్యాలయాలను విధ్వంసం చేయటానికి పూనుకున్నారని ఆయన తెలియజేశారు. "1539 ప్రాంతాల్లో గృహదహనాలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, లూటీలకు పాల్పడ్డారు. 500 చోట్ల అనేక రబ్బరుతోటలను, వందలాది చిన్న షాపులను బలవంతంగా ఆక్రమించుకొని కొల్లగొట్టారు".

ప్రతిరోజూ బిజెపి ఒక్కటొక్కటిగా తన వికృత లక్షణాలను వెల్లడిచేసుకొంటోంది. భారతదేశంలో సామ్రాజ్యవాదానికి, దోపిడీ పాలకవర్గాలకు సేవచేసే ఏకైక శక్తిగా చూపుకునేందుకు-తన తోవలో అడ్డుగానున్న అసమ్మతి, వ్యతిరేక గళాలను, సిద్ధాంతాలను, రాజకీయాలను బలహీనపరిచి ధ్వంసంచేసేందుకు అది ఎటువంటి విధానాన్నైనా చేపట్టి ప్రజలపై ప్రయోగిస్తోంది.

ఈ తరహా ప్రతీఘాతుక, ఫాశిస్టు తరహా ఆలోచనా ధోరణి, చర్యలను తీవ్రంగా ఖండించాలి. వీటికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక, రాజకీయశక్తులన్నీ కలసికట్టుగా పోరాడాలి.

**విశ్వం**
**2018 మార్చి, 6** — ప్రధానకార్యదర్శి
సిపిఐ(ఎం-ఎల్)

ooooo